క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ...'

కదిరి: పట్టణంలోని 32వ వార్డులో ఎమ్మెల్యే డా పీవీ సిద్దారెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అయిన అజ్జుకుంటు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వేమారెడ్డి కూడలి నుంచి ఉదయం 7:30 గంటలకు ప్రారంభిస్తామన్నారు.

అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి



పుట్టపర్తి అర్బన్: అగ్రి అడ్వైజరీ బోర్డు మండల చైర్మన్‌గా జగరాజుపల్లికి చెందిన సూర్యనారాయణరెడ్డిని నియమించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బరావు, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గతంలో పని చేసిన మహేష్‌కుమార్‌రెడ్డి వృత్తిరీత్యా అమెరికాకు వెళ్లడంతో చైర్మన్ పదవికి సూర్యనారాయణరెడ్డిని ఎంపిక చేశామన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

నల్లమాడ: నల్లమాడ గ్రామ పంచాయతీ పరిధిలోని చేపల చెరువులు, చింతచెట్లను బుధవారం ఉదయం 10–30 గంటలకు సర్పంచ్ భారతి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి జనార్థన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

గంగమ్మ పాదాలను తాకిన సూర్యకిరణాలు



గంగమ్మ తల్లి పాదాలను తాకుతున్న సూర్య కిరణాలు

బత్తలపల్లి: బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన గంగమ్మ తల్లి పాదాలను సూర్య కిరణాలు తాకాయి. మంగళవారం ఆలయ అర్చకులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఈ సుందర దృశ్యాన్ని పలువురు భక్తులు ప్రత్యేకంగా తిలకించారు.

నేడు రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం

కదిరి అర్బన్: పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు కదిరి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగూరి రామచంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణ మంటపం భూమిపూజ కార్యక్రమానికి విరాళాలు ఈనెల 20లోపు అందించాలని తెలిపారు. ప్రభుత్వం కటారుపల్లిలో యోగివేమన జయంతిని అధికారికంగా నిర్వహిస్తుండడంతో ఉచిత అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

టీఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఓడీ చెరువు: ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) నూతన క్యాలెండర్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ శ్రీధర్, టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ ఆవిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు టీఎస్ఎఫ్ సహాయ సహకారాలు అందించాలన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అక్కులప్ప మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై టీఎస్ఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథనాయక్, సహాయకార్యదర్శి దివాకర్‌నాయక్, అనిల్‌ప్రసాద్‌నాయక్, ధోనినాయక్, జగన్‌నాయక్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

కదిరి అర్బన్: మండలంలో కుమ్మరవాండ్లపల్లి, పట్నం, కాళసముద్రం, యర్రదొడ్డి, మొటుకుపల్లి పంచాయతీ ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ సుధామణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న కుమ్మరవాండ్లపల్లి ఎంపీయూపీ స్కూల్, 20న పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, 21న కాళసముద్రం ఎంపీయూపీ పాఠశాల, 23న యర్రదొడ్డి ఎంపీపీ స్కూల్, 24న మోటుకుపల్లి కొలేపల్లి ఎంపీపీ స్కూల్‌లో ఆధార్ అప్డేట్ చేసుకోవాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

పుట్టపర్తి: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బీసీ కులానికి చెందిన తనకు మండల ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

ఘనంగా తెప్పోత్సవం

● పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండలంలోని పంతులచెరువులో సర్పంచ్ స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిసినట్లు తెలిపారు. మండలంలోనే అతి పెద్ద చెరువైన పంతులచెరువును హంద్రీ–నీవా జలాలతో నింపినట్లు పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల తరువాత మళ్లీ పంతులచెరువులో తెప్పోత్సవాలను జరిపించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే తెప్పోత్సవ కమిటీ సభ్యులకు రూ. 50 వేలు అందజేశారు. తెప్పోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు, ప్రజలు తరలివచ్చారు. గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందుకూరిపల్లి గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. డీఎల్‌డీఓ అంజినప్ప, వైఎస్సార్ సీపీ యువ నాయకులు వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, వై.రమణారెడ్డి, బీసీ సెల్ లక్ష్మీపతియాదవ్, సానే హరినాథ్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి, బాలకృష్ణారెడ్డి, వై. పవన్, వై. గురుప్రసాద్‌రెడ్డి, సమీవుల్లా, ఉత్తన్న, రామాంజనేయులు, కరీం, నరసింహులు పాల్గొన్నారు.

పాయకట్ట చెరువు వరకూ రోడ్డు మంజూరు



పాయకట్ట చెరువు రహదారిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

నల్లమాడ: మండలంలోని పెమనకుంటపల్లి అటవీ ప్రాంతంలోని పాయకట్ట చెరువు వరకూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్డు మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. పెమనకుంటపల్లిలో వారం రోజుల క్రితం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని పాయకట్ట చెరువు వైపు తమకు పొలాలు, మామిడి తోటలు అధికంగా ఉన్నాయని, 40 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పాయకట్ట చెరువు వరకూ మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు మంజూరు చేస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేగాక రహదారికి అడ్డంగా రైతుల పొలాల్లోని ముళ్లపొదల తొలగింపునకు గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అక్కడికక్కడే ప్రకటించారు. దీంతో రైతులు జేసీబీలతో పొలాల్లోని ముళ్లపొదలు, బండరాళ్లను తొలగించే పనులు ముమ్మరం చేశారు. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, నాయకులు అంజినాయక్, గోవిందరెడ్డితో కలసి ఉపాధి ఏపీఓలు సూర్యనారాయణ, సుబహాన్ రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అంచనాలు తయారు చేసి త్వరలోనే మట్టిరోడ్డు నిర్మాణం పనులు చేపడతామన్నారు. అడిగిన వెంటనే తమ పొలాలకు రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే తరిమికొడతాం



మాట్లాడుతున్న రేగాటిపల్లి సురేష్‌రెడ్డి

ధర్మవరం రూరల్: మత విద్వేశాలను రెచ్చగొడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే తరిమి కొడతామని వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు, రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని సురేష్‌రెడ్డి నివాసంలో రైతులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన నాయకుడినని చెప్పుకుంటూ రేగాటిపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి ధర్మవరంలో ముస్లింల మధ్య చిచ్చు పెట్టి, సంబంధం లేని విషయంపై ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించబోమన్నారు. ముస్లింల ప్రార్ధనల కోసం ఈద్గాకు స్థలం కేటాయించడంతో పాటు వేలాది మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించిన ఎమ్మెల్యేపై భూకబ్జాదారుడంటూ ఆరోపణలు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, నాగభూషణ, చిన్న సుబ్బరాయుడు, రమణారెడ్డి, నారాయణరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



వడ్డె రామచంద్ర (ఫైల్)

కొత్తచెరువు: మండల కేంద్రంలో రైతు వడ్డె దండగల రామచంద్ర (49)అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు కొత్తచెరువులోని ఇసుకవంక వీధిలో నివాసముంటున్న రామచంద్రకు మూడు ఎకరాల పొలం ఉంది. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు రూ.16 లక్షల దాకా పేరుకుపోయాయి. అప్పులు తీరే మార్గం కానరాక మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంలో లింగారెడ్డిపల్లి రహదారిలోని చింతతోపు దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగిన అనంతరం చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకొని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య సరళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'అనంత ఆణిముత్యాలు'ను విజయవంతం చేయండి

పెనుకొండ: పట్టణంలో ఈనెల 28న జరిగే 8వ అనంత ఆణిముత్యాల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. మంగళవారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలసిన ప్రతాపరెడ్డి పురస్కార ప్రదాన కార్యక్రమంలో పాల్గొనాలని బ్రోచర్ అందించి ఆహ్వానం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన 23 మంది ప్రముఖులకు ఈ పురస్కారాలను అందిస్తున్నట్లు ఆయన కలెక్టర్‌కు వివరించారు.

21 నుంచి వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు



మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో వెలసిన వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 21న కలశ స్థాపన, జ్యోతులు, కల్యాణోత్సవం, 22న నాగదేవతా హోమం, చండీయాగం, మధ్యాహ్నం అమ్మవారి బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

యోగి వేమన చిత్రపటం ఆవిష్కరణ



యోగి వేమన చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ మీనాక్షి

కదిరి అర్బన్: గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో కదిరి ప్రాంత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రజాకవి యోగివేమన చిత్రపటాన్ని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 19న ఈ చిత్రపటాన్ని కదిరి ప్రాంతంలోని 10 మండలాల్లో పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు లలితమ్మ, వేమనారాణయ, కృష్ణానాయక్, ఖాదర్‌వలీ, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న ఉచిత గుండె వైద్య శిబిరం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈనెల 21న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా డాక్టర్లతో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2డీ ఎకో, జీఆర్‌బీఎస్, ఇసీజీ, బీపీ తదితర వాటికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైతే శస్త్ర చికిత్సలకు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి: 'స్పందన'లో ప్రజల నుంచి అందే ప్రజా సమస్యలపైన దృష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవీ పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో ఐదు అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో ఐదు అర్జీలు కూడా భూ సమస్యలపైనే అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిమనోహర్, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

22 నుంచి ఆలయ వార్షికోత్సవం

బత్తలపల్లి: బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరస్వామి ఆలయ నాల్గో వార్షికోత్సవం, మాఘమాస మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 22న గంగపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, పంచగవ్యప్రాశన, నవగ్రహ ఆరాధన, అంకురార్పణ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నవగ్రహ, ధన్వంతరీ, మృత్యుంజయ హోమాలు, స్వామి వారి అభిషేకాలు విశేషపూజలు ఉంటాయన్నారు. 23న పంచామృతాభిషేకం, రుద్రాభిషేకాలు, రుద్రహోమం, మన్యుసూక్త హోమం, 24న షోడషోపచారపూజ, గణపతి, నవగ్రహ హోమం, 11 గంటల నుంచి శివపార్వతుల కళ్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం. రాత్రి 8 గంటలకు శివస్వాములకు భిక్ష జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ

కదిరి టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డితో కృష్ణ గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షురాలు కల్పలతా రెడ్డి భేటీ అయ్యారు. మార్చి నెలలో జరగబోవు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు.

ఉత్సవాల నిర్వహణపై నేడు సమావేశం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చిస్తామన్నారు. సర్పంచ్ ఆదినారాయణతో పాటు గ్రామ పెద్దలు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జేఏసీ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

యువకుడికి గాయాలు

ఎన్పీకుంట: బందారుచెట్లపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి గాండ్లపెంట మండలం జీన్లకుంటకు చెందిన పవన్ కుమార్ గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డాక్టర్‌కు ఘన సన్మానం



డాక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ నాగేంద్రనాయక్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బసంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వసల్మా, డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, సీహెచ్ఓ దివ్య, ఎస్ఏఎంఎం సుజాత, వినయ్‌కుమార్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పార్వేట



పార్వేట నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో మంగళవారం గ్రామస్తులు పార్వేట ఉత్సవం సందడిగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమ పండుగ రోజున గ్రామంలో కుందేలు పారాట నిర్వహించడం, రాత్రివేళ గ్రామంలో కాటికోటేశ్వర స్వాములను ఊరేగించడం ఆనవాయితీ. అయితే కనుమ రోజున (సోమవారం) అడవిలో కుందేళ్లు పట్టుబడలేదు. దీంతో గ్రామ సమీపంలోని అడవిలో మంగళవారం గ్రామస్తులు వేట నిర్వహించగా మూడు కుందేళ్లు పట్టుబడ్డాయి. గ్రామ నడిబొడ్డున సాయంత్రం 4 గంటకు కుందేళ్ల పార్వేట నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కాటికోటేశ్వరస్వామి ఊరేగింపు

చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి ఆలయంలో స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. పరమేశ్వరుని ఉత్సవ విగ్రహానికి వెండి గొడుగులు తొడిగి, పూల మాలలతో అలంకరించారు. డప్పుల వాయిద్యాలు, ఉరుముల వాయిద్యాలతో గ్రామంలో ఘనంగా ఊరేగించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు బుధవారం వేకువజాము 4 గంటలకు ముగిసింది. వీధి, వీధిన మహిళలు స్వామికి నీళ్లారబోసి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దశివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఊరు దేవర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి



పోతలయ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో మంగళవారం పెద్దమ్మ, పోతలయ్యస్వాముల ఊరు దేవరను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దేవర పోతులను బలి ఇచ్చారు. గ్రామస్థులు పోతులయ్య స్వామికి బోనాలు సమర్పించి గావుల మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం జనసందోహం మధ్య గ్రామ దేవతలను ఊరేగించారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి:

ఊరు దేవరకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పెద్దమ్మ, పోతలయ్యస్వామి ఆలయాల్లో జరిగిన పూజలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పోతలయ్య ఉత్సవ విగ్రహం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఊరు దేవర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగుల సుధీర్‌రెడ్డి, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి



వేమన ఆలయ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: కటారుపల్లి వేమన సమాధి వద్ద ఈ నెల 19న నిర్వహించనున్న విశ్వకవి యోగివేమన జయంత్యుత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే కటారుపల్లి వేమన ఆలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేమన జయంత్యుత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా హాజరుకానున్నట్లు తెలిపారు. వేమన ఆలయ పరిసరాలు, సభాస్థలిని పరిశీలించారు. ఎమ్మెల్యే, జిల్లా పర్యాటక అధికారి నాగేశ్వర రెడ్డి, తహసీల్దార్ రవి, ఈఓఆర్డీ సునీత, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ తాతం జగన్‌మోహన్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, స్థానిక నాయకులు ఉత్తన్న, కృష్ణారెడ్డి, రెడ్డిసంక్షేమ సంఘం ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాలలు అన్ని రంగాల్లో రాణించాలి

అమరాపురం: మాల కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ రాష్ట్ర మాల మహానాడు సంఘం ఐక్య వేదిక అధ్యక్షుడు రామరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో వీరనారి, వీర వనిత ఓణికే ఓబవ్వ శత జయంతి ఉత్సవాలను మాల సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల నుంచి వెండి రథంలో చిన్నారులు ఓణికే ఓబవ్వ వేషధారణతో ఉరుములతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రామరావు, శ్రీ సత్యసాయి జిల్లా మాల మహానాడు ఐక్య వేదిక అధ్యక్షుడు శంకర్, అగళి వెంకటస్వామి, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగులయ్య, మూర్తి, సోము సంఘం సభ్యులు మల్లికార్జున, క్రిష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ మాల సోదరులు ఐకమత్యంతో రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: తప్పిపోయి ఒంటరిగా విలపిస్తున్న బాలుడిని తల్లిదండ్రుల చెంతకు బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష చేర్చారు. వివరాలు.. అనంతపురంలోని సాయినగర్ ఫస్ట్ క్రాస్‌లో నివాసముంటున్న బాలకృష్ణ, హరిత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. మంగళవారం ఉదయం ముదిగుబ్బ మండలం మంగళమడక నుంచి అనంతపురానికి హరిత తన ఇద్దరు పిల్లలతో కలసి ఆర్టీసీ బస్సులో ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బస్సులో సీటు లేకపోవడంతో పెద్ద కుమారుడు అఖిల్‌ను ఓ ప్రయాణికుడి వద్ద కూర్చొబెట్టి చిన్నారితో కలసి మరో సీటులో ఆమె కూర్చొంది. మార్గమధ్యంలో బత్తలపల్లి రాగానే తాను కూర్చొన్న వ్యక్తి వెనుకనే అఖిల్ కూడా బస్సు దిగాడు. ఎస్కేయూ వద్దకు బస్సు చేరుకుంటుండగా అఖిల్ తప్పిపోయినట్లుగా తల్లి గుర్తించి విషయాన్ని భర్త బాలకృష్ణకు చేరవేసింది. బస్సు అనంతపురం చేరుకోగానే దంపతులిద్దరూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే బత్తలపల్లిలో ఒంటరిగా ఏడుస్తున్న బాలుడిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సంద్రా రామకృష్ణ, కుమ్మర శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు మదనాపు శ్రీనివాసులు గుర్తించి చేరదీసి ఎస్‌ఐ టీవీ శ్రీహర్షకు అప్పగించారు. కాసేపు బుజ్జగించిన అనంతరం తన పేరు అఖిల్ అనిడాడీ పేరు బాల అని, తల్లిని మమ్మీ అని, రామన్ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలిపాడు. ఎలా వచ్చావనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. దీంతో విషయాన్ని అనంతపురం పోలీసులకు ఎస్‌ఐ శ్రీహర్ష చేరవేశారు. విషయం తెలుసుకున్న బాలకృష్ణ బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్‌ఐతో మాట్లాడారు. తగిన ఆధారాలు చూపిన తర్వాత బాలుడిని తండ్రికి పోలీసులు అప్పగించారు.